## క్లుప్తంగా

### నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు

ఉండి: మండలంలోని చెరుకువాడ సీబీసీఎన్‌సీ బాప్టిస్ట్ చర్చ్‌లో ఆకివీడు స్టార్ ఆఫ్ హోప్ హాస్పిటల్, పిఠాపురం క్రిష్టియన్ మెడికల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఫీల్డు కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు రెవరెండ్ ఎస్.జార్జ్‌ముల్లర్ సహకారంతో, సీబీసీఎన్‌సీ ఏడు సంఘాల అధ్యక్షుడు కోరాటి శ్యామ్ రూ.20 వేల ఆర్థిక సాయంతో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారుగా 170 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీఎంసీ పిఠాపురం డైరెక్టర్ డాక్టర్ వై.అమృత్‌లాల్, డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ జూపూడి ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆకివీడు: రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించాలంటే ధాన్యం కొనుగోలు కేంద్రాలను తప్పనిసరిగా సంప్రదించాలని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని చినకాపవరం గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతులు ధాన్యంను ఏ మిల్లుకైనా అమ్ముకోవచ్చునన్నారు. మండల వ్యవసాయాధికారిణి ప్రియాంక మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర క్వింటాల్‌కు కామన్ రకం రూ.2300, ఏ గ్రేడ్ రకం ధాన్యం రూ.2320 ఉందన్నారు. మండలంలోని ఏడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

### పారదర్శకంగా రేషన్ సరుకుల పంపిణీ

పాలకోడేరు: వినియోగదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా పారదర్శకంగా రేషన్ సరుకులను పంపిణీ చేయాలని పాలకోడేరు మండల సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ఆదిశేషయ్య ఆదేశించారు. ఈ మేరకు బుధవారం తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన రేషన్ డీలర్లకు, ఎండీయూ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. పంచదార, కందిపప్పు కార్డుదారులకు పంపిణీ చేయాలని, ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రేషన్ డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు దొంగ కృష్ణ, కేఎస్ఆర్ ఆంజనేయులు, కొల్లా సత్యనారాయణ, దుర్గా సుజాత ఉషారాణి, ఎస్.పద్మజ, మునీశ్వరరావు, చినబాబు, ఎండీయూ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

### ఒడిశా బృందం పర్యటన

కాళ్ల: ఒడిశా మత్స్యశాఖ బృందం కాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం క్షేత్ర పర్యటన చేశారు. మత్స్యశాఖలో అత్యధిక దిగుబడి సాధిస్తున్న దృష్ట్యా రైతులు పాటిస్తున్న యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసలి గ్రామంలో చేపలు, రొయ్యల చెరువుల సాగుతో పాటు, నెక్సస్ ఫీడ్ ఫ్యాక్టరీ, కాళ్ల గ్రామంలో స్పాన్ హేచరీలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఇప్పటికే ఒడిశాకు చెందిన మూడు మత్స్యశాఖ బృందాలు ఇక్కడ పర్యటించామని, ఇది నాలుగో బృందమని తమ రాష్ట్రంలోని మత్స్య సంపదను మెరుగు పరిచేందుకు క్షేత్ర స్థాయి పర్యటనకు వచ్చామన్నారు. సీసలి, చినకాపవరం మత్స్యశాఖ సహాయకులు సత్యనారాయణ, అహ్మద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లకు దారేది?




రాయకుదురు జగనన్న లేఔట్లలో రహదారి సౌకర్యం లేని దృశ్యాలు

వీరవాసరం: ప్రతి వ్యక్తీ తన జీవితంలో స్థలం సంపాదించుకోవాలని ఇల్లు కట్టుకోవాలని ఆశతో జీవిస్తూ ఉంటాడు. అలా స్థలం ఇల్లు ఏర్పాటు చేసుకున్న ప్రాంతంలో రహదారి సౌకర్యం లేకుండా ఉంటే ఆ ప్రాంత వాసులకు నరకప్రాయంగానే ఉంటుంది, వీరవాసరం మండలం రాయకుదురు గ్రామంలో గత ప్రభుత్వంలో ఐదు చోట్ల జగనన్న లేఔట్లను ఇచ్చింది. 243 మంది లబ్దిదారులకు సొంత ఇంటి స్థలాన్ని ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో ఇళ్లను నిర్మించుకున్నారు. ప్రతి పేదవాడి ఇంటికలను నెరవేర్చాలని పేదవాడి కలను నెరవేర్చాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అర్హులైన పేదవారందరికీ ఇళ్ల స్థల పట్టాలు, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. లబ్దిదారులంతా తమ తమ కేటాయించిన స్థలాల్లో నిర్మించుకున్నారు. అయితే ఆ ప్రాంతాల్లో తమ తమ ఇళ్లకు వెళ్లడానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ నానా అవస్థలు పడుతున్నారు.

**బురదమయంగా కాలనీలు**

జగనన్న లేఅవుట్లలో సరైన రహదారి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షానికి ఉన్న మట్టి రోడ్లు, కంకర రోడ్లన్నీ మట్టి రోడ్లుగా మారి బురదమయంగా మారుతున్నాయి. మోకాలు లోతు నీటిలో ఇంటికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తోట వారి వీధి కాలనీ, మావుళ్ళమ్మ కాలనీలో రహదారి సౌకర్యం లేక కేవలం మట్టిరోడ్లనే పైనే వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో అడుగు పెట్టాలంటేనే భయమేస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. రహదారిపైకి మట్టి రోడ్లపైకి పాములు వంటి విష జంతువులు తిరుగాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జగనన్న కాలనీలకు రోడ్లను మంజూరే చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### మౌలిక వసతులు లేవు

జగనన్న లేఔట్లలో సరైన మౌలిక వసతులు లేవు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యామా అంటూ ఇల్లు కట్టుకున్నాను. వర్షం వస్తే వర్షానికి కాళ్లు బయటపెట్టే పరిస్థితులు లేవు. రాత్రి వేళల్లో విష జంతువుల భయం ఎక్కువగా ఉంది. జగనన్న కాలనీల్లో రహదారులు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి.

– కె.నాగలక్ష్మి, రాయకుదురు

### చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో రహదారి నిర్మాణం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. జరుగుతుంది. ప్రయారిటీ ప్రకారం గ్రామాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ రహదారులు డ్రెయినేజీలు నిర్మిస్తున్నాం. ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రభుత్వ పెద్దల సహాయ సహకారాలతో కచ్చితంగా ప్రజలందరికీ మంచి రహదారులు డ్రెయినేజీలు నిర్మిస్తాం.

– కె రమేష్: పంచాయతీరాజ్ ఏఈ

### పాఠశాలల సమయం పొడిగింపు ప్రతిపాదన తగదు

పాలకోడేరు: పాఠశాలల సమయాన్ని 5 గంటల వరకూ పొడిగించాలన్న ప్రతిపాదన తగదని, ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని యూటీఎఫ్ కోరింది. ఈ మేరకు యూటీఎఫ్ జిల్లా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీఎస్ విజయరామరాజు, ఏకేవీ రామభద్రం బుధవారం పాలకోడేరులో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు సాయంత్రం 4 గంటలకూ పాఠశాల పని చేసేదని, దాన్ని అయిదు గంటలకు పెంచితే విద్యార్థులు ఇంటికి వెళ్లే సరికి చీకటి పడి ఇబ్బంది పడతారన్నారు.

### వృద్ధురాలిపై అఘాయిత్యం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వృద్ధురాలిపై అఘాయిత్యం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తుమ్మ గొప్పి గ్రామానికి చెందిన తాళ్లూరు సుశీల (65)పై అదే గ్రామానికి చెందిన ఈదా కృపావరం తెల్లవారుజామున అఘాయిత్యం చేసినట్టు బాధితురాలు సుశీల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్సై వీర్రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఘనంగా నిత్య సహాయక మాత ఆలయ వార్షికోత్సవం

ఉండి: మండలంలోని మహదేవపట్నం గ్రామంలోని నిత్య సహాయకమాత ఆలయ 14వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ కె.జాన్, ఫాదర్ ఫ్రాన్సిస్, ఫాదర్ రాజశేఖర్ ఏసుక్రీస్తు ఉపదేశాలను వివరించారు. కార్యక్రమంలో కొమ్మరి ఛార్లెస్, సంఘ పెద్దలు కంకిపాటి బాలకృష్ణ, వీరవల్లి రాజేష్, దిగమర్తి కిశోర్, కంకిపాటి ప్రభుదాస్ పాల్గొన్నారు.

### బస్సు షెల్టర్ ప్రారంభం

కాళ్ల: దాతల సహకారంతో కలవపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామ పెద్దలు మంతెన వెంకటరాజు కుమారులు మంతెన శివాజీ రాజు జ్ఞాపకార్థం గ్రామంలో బస్ స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. బస్టాండ్ గ్రామ సర్పంచ్ గేదెల జాన్, మంతెన పెద్ద నరసింహ రాజు, మంతెన వెంకటరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభించారు.

### అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

కాళ్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని కలవపూడి గ్రామ సర్పంచ్ గేదెల జాన్ తెలిపారు. కలవపూడి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ బుధవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గేదల జాన్, గ్రామ పెద్దలు మంతెన బొండు రాజు, దాట్ల రామరాజు, దళిత నాయకులు కోనా జోసెఫ్ సమక్షంలో నూతన విగ్రహాన్ని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పెద్దలు పలువురు దళిత నాయకులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల రామరాజు, సోదదాసి గంగయ్య, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువదళం ప్రెసిడెంట్ బందెల కన్నయ్య రాజు, దాసి ఏసు రత్నం, తదితరులు పాల్గొన్నారు.

### 24న పుస్తకావిష్కరణ

ఉండి: రచయిత, వేద విజ్ఞాన పరిషత్ చైర్మన్ డీవీ బాలసుబ్రహ్మణ్యం రచించిన 17వ పుస్తకం అమ్మా నాన్న అనే కథా సంపుటి ఈ నెల 24 ఆదివారం ఆవిష్కరిస్తున్నట్లు బుధవారం పత్రికా ప్రకటనలో ఆయన తెలిపారు. ఉండి లయన్స్ ఆడిటోరియంలో ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, రుద్రరాజు ఫౌండేషన్ ఆర్‌వీఎస్‌రాజు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

# ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

భీమవరం: గ్రంథాలయాలకు ఆదరణ నానాటికి తగ్గిపోతుందని, గుడికి, బడికి వెళ్ళినట్లే గ్రంథాలయాలకు కూడా తరచు వెళ్లాలని జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య వర్తక సంఘం (త్యాగరాజు భవనం)లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను గ్రంథాలయానికి వచ్చి కాంపిటీటివ్ పుస్తకాలను ఉపయోగించుకుని ఐఏఎస్ అధికారిగా ఉన్నత స్థానాన్ని పొందానని గుర్తు చేసుకున్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, సంగీతము, క్విజ్, రంగోలి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు మొదట, ద్వితీయ, తృతీయ కన్సోలేషన్ బహుమతులను జిల్లా జాయింటు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ కుమారేశ్వరన్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టరు కేవీ సుబ్బరాజు, సైక్రియాట్రిస్ట్ కన్సలెంటు డాక్టర్ ఆర్.రామకృష్ణంరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.నారాయణ, మున్సిపల్ కె.రామచంద్రా రెడ్డి, తహసీల్దారు రావి రాంబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖరు బాబు తదితరులు పాల్గొన్నారు.

**భవిష్యత్‌కి పునాదులు బాలలే**

వీరవాసరం: వీరవాసరం బోను పవిడయ్య శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వార్షికోత్సవం ముగింపు సభ బుధవారం ఎమ్మార్కె జెడ్పీ హై స్కూల్లో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న పిల్లలు కల్మషం లేని స్వచ్ఛమైన మనస్సు కలిగి ఉంటారని అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు పంపన సాయిబాబు, గ్రంథాలయ అధికారి బత్తుల హనుమంతరావు, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు: సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా లవకుశ పాత్రలో విద్యార్థినులు



ఉండి: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో రవీంద్ర, ఎస్సై నసీరుల్లా

**గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు**

ఉండి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, మాన జీవితానికి మార్గదర్శి అని ఎంపీడీవో ఎస్.రవీంద్ర, ఎస్సై నసీరుల్లా అన్నారు. బుధవారం ఉండి శాఖా గ్రంథాలయ 57వ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎంపీడీవో, ఎస్సై మాట్లాడుతూ మా విజయాల వెనుక గ్రంథాలయా పాత్ర కీలకమన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు అధ్యక్షుడు సత్తిబ్రహ్మారెడ్డి, గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లైబ్రరీ అధికారి జేవీ కృష్ణమూర్తి,పీవీ శ్యామలరావు పాల్గొన్నారు.

**యండగండిలో**

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని కో–ఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రవికుమార్ విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

**ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు**

ఆకివీడు: బుడి బుడి అడుగులతో చిన్నారుల బేబీ షో పలువురిని ఆహ్లాదపరచింది. ముక్కుపచ్చలారని చిన్నారులు భగవద్గీత పఠనం ఆశ్చర్యపరచింది. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆనందింపజేశాయి. స్థానిక శాఖా గ్రంథాలయం 57వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రీడర్స్ ఫోరం అధ్యక్షులు దాసరి సత్యనారాయణ, లయన్స్ ప్రతినిధులు నెల్లి సతీష్, అహ్మద్, కురెళ్ల పొలు గ్రంథాలయ అధికారిణి పార్వతి పాల్గొన్నారు.

## పుస్తక పఠనంలో విజ్ఞాన సముపార్జన

భీమవరం: పుస్తకాలు, గ్రంథాల అధ్యయనం ద్వారా విజ్ఞానం, మేథస్సు, వ్యక్తిత్వ వికాసం పొందవచ్చని జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కేసీహెచ్ అప్పారావు అన్నారు. పట్టణంలో చదువరుల సంఘం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం క్విట్ ఇండియా స్థూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎందరో గ్రంథాలయాల్లోని పుస్తకాలను అధ్యయనం చేసి ఉన్నత స్థానానికి చేరుకోవడమేగాక మహోన్నత పదవులు సంపాదించారన్నారు. మావుళ్ళమ్మ దేవస్థానం ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ మాట్లాడుతూ పుస్తకం మంచి స్నేహితుడు వంటిదని, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. వారోత్సవాల నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అసరవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత వారం రోజులు నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన 63 మందికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అల్లూరి రవి వర్మ, సత్యనారాయణ రాజు, మద్దిరాల మల్లికార్జునశర్మ, పేరిచర్ల లక్ష్మణ వర్మ, నందమూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

# సౌర విద్యుత్‌తో నగదు ఆదా

భీమవరం (ప్రకాశంచౌక్): సౌర విద్యుత్ ఏర్పాటుతో ఎంతో నగదు ఆదా అవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. భీమవరం పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీలో కె.సూర్యనారాయణ రాజు ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ విద్యుత్ యూనిట్‌ను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వినియోగదారుడు కె.సూర్యనారాయణ రాజు కరెంట్ బిల్లు తగ్గిందని చెప్పడంతో జాయింట్ కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి సౌర విద్యుత్ వాడకం పెరిగేలా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. జేసీ వెంట జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఆలపాటి రఘునాథబాబు, ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు, ఏఈ పద్మశ్రీ, తదితరులు ఉన్నారు.



వినియోగదారుడితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

# మెడలోని బంగారు నానుతాడు చోరీ

భీమవరం : స్థానిక సుంకర పద్దయ్య వీధి నుంచి తన భర్తతో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు తన మెడలోని బంగారు నానుతాడు దొంగిలించారని పట్టణానికి చెందిన జవ్వాది వరలక్ష్మి ఫిర్యాదు చేసినట్టు భీమవరం వన్ టౌన్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి టిడ్కో నివాసం వద్ద నుంచి వరలక్ష్మి తన భర్త గణేష్ శ్రీనివాస్‌తో కలిసి తాడేరురోడ్డులోని టిడ్కో ఇళ్ల వైపునకు వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తమ బైక్‌ను ఆపి తన మెడలోని రూ.1.25 లక్షల విలువైన అయిదు కాసుల బంగారు నానుతాడు లాక్కున్నారని పేర్కొన్నారు. వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

## భీమవరం చేరుకున్న ధర్మప్రచార రథం

భీమవరం(ప్రకాశం చౌక్): ధర్మ ప్రచారంలో భాగంగా వారి రథం భీమవరానికి విచ్చేసింది. బుధవారం హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి విచ్చేయగా ఆలయ అధ్యక్షులు కంతేటి వెంకటరాజు కమిటి సభ్యులు ఆలయఅర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు భక్తులు హౌసింగ్ బోర్డ్ కాలనీ ముఖద్వారం వద్ద స్వాగతం పలికి శోభాయాత్రగా ఆలయానికి తీసుకువెళ్లారు. అనంతరం ఆలయ మర్యాదలతో స్వామివారికి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి వారిని,అమ్మవారిని కాలనీ వాసులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయానికి రథం చేరుకుంది. స్వామి వారికి,అమ్మవారికి మావుళ్లమ్మ ఆలయ తరుపున పూజలు నిర్వహించారు. భక్తులు రథం వద్దకు చేరుకుని స్వామివారిని,అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మహలక్ష్మీ నగేష్,ఈవో దండు కృష్ణంరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడి సాయం తక్షణం అందించాలి

భీమవరం: ఎన్నికలకు ముందు రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తానన్న రూ.20 వేలు తక్షణం అందించి ఆదుకోవాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి రుణ పరపతి కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ కూటమి పార్టీలు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చాయని, అధికారం చేపట్టి ఐదు నెలలు దాటినా ఇప్పటికీ సాగు సాయం ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని, గోనె సంచులు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ ఆనంద్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు పాల్గొన్నారు.



భీమవరంలో డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

## వైభవంగా కార్తీక దీపోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీక మాసం సందర్భంగా ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్, దేవాదాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబిక కల్యాణం, కార్తీక దీపోత్సవాలను నిర్వహించారు. ముందుగా స్వామి వార్ల ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టీ రాహుల్ కుమార్ రెడ్డి, సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ పూజా కార్యక్రమాల్లో పాల్గొని దీపోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ ఉద్దరాజు కాశీవిశ్వనాథరాజు, కంతేటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

## సౌత్‌జోన్ ఆటల పోటీలకు విష్ణు క్రీడాకారుల ఎంపిక

భీమవరం: జేఎన్‌టీయూకే యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించే సౌత్‌జోన్ ఆటల పోటీలకు భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.వెంకట రామరాజు చెప్పారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం కళాశాలలో అభినందించారు. ఎయిర్ పిస్టల్ రైఫిల్ షూటింగ్‌లో ఆర్‌సీ లాస్య మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిందని డిసెంబర్‌లో పంజాబ్ రాష్ట్రంలోని చండీగఢ్‌లో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. బాడ్మింటన్ పోటీల్లో శ్యామలగౌరీ మొదటిస్థానంలో నిలిచి ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు కర్ణాటకలోని బెల్గావి విశ్వేశ్వరాయ టెక్నాలాజికల్ యూనివర్శిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. అలాగే నెట్ బాల్ పోటీల్లో జి.హనీష్మా అర్హత సాధించి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు వెంకటరామరాజు వివరించారు. అనంతరం క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపల్ జి శ్రీనివాసరావు, క్యాంపస్ డైరెక్టర్ జె.ప్రసాదరాజు, స్టూడెంట్స్ ఎఫైర్స్ డైరెక్టర్ పి.శ్రీనివాసరాజు అభినందించారు.



సౌత్‌జోన్ ఆటల పోటీలకు ఎంపికైన విష్ణు విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

## బాలల హక్కులపై అవగాహన

భీమవరం: బాలలకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమసాధికారిక అధికారిణి బి.సుజాతరాణి అన్నారు. బుధవారం భీమవరం సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆపదలో ఉన్న బాలలు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునన్నారు. సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్, భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం, లీగల్ అడ్వైజర్ పి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.